క్లుప్తంగా

పలువురికి పార్టీ పదవులు

పట్నంబజారు: వైఎస్సార్ సీపీ అధ్యక్షులు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు జిల్లాలోని పలువురిని పార్టీ పదవుల్లో వివిధ హోదాల్లో నియమించారు. ఈ మేరకు శనివారం కేంద్ర పార్టీ కార్యాలయం నుంచి ఉత్తర్వులు జారీ అయ్యాయి. తెనాలి అసెంబ్లీ నియోజకవర్గానికి సంబంధించి క్రిస్టియన్ మైనార్టీ సెల్ అధ్యక్షుడిగా పసుపులేటి ఆనంద్‌కుమార్, కొల్లిపర విద్యార్థి విభాగం మండల అధ్యక్షుడిగా దాసరి రవితేజ, తెనాలికి నూతక్కి అభిషేక్, తెనాలి మున్సిపాలిటీ లీగల్ విభాగం అధ్యక్షుడిగా పిల్లి ప్రేమ్‌రాజ్, తెనాలికి మందపాటి కోటేశ్వరరావు, గ్రీవెన్స్ విభాగానికి సంబంధించి తెనాలి మున్సిపాలిటీకి తాడిబోయిన నాగార్జున, తెనాలికి షేక్ హుస్సేన్‌లను నియమించారు.

విధులకు గైర్హాజరైతే చర్యలు తప్పవు

కమిషనర్ జె.ఆర్.అప్పలనాయుడు



తెనాలిఅర్బన్: విధులకు గైర్హాజరైతే చర్యలు తప్పవని మున్సిపల్ కమిషనర్ జె.ఆర్.అప్పలనాయుడు హెచ్చరించారు. మూడోవ శానిటేషన్ డివిజన్ కార్యాలయాన్ని శనివారం ఉదయం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. అటెండెన్స్‌ను పరిశీలించి కార్మికుల హాజరుశాతం తక్కువగా ఉండటంపై ఆరా తీశారు. పట్టణంలో కార్మికుల సంఖ్య తక్కువగా ఉందని, ఉన్న తక్కువ మంది విధులకు గైర్హాజరైతే పారిశుద్ధ్య నిర్వహణ కష్టసాధ్యంగా మారిందని తెలిపారు. ఎవరు అనధికారికంగా గైర్హాజరు కావద్దని సూచించారు. ఆయన వెంట పలువురు మున్సిపల్, సచివాలయ ఉద్యోగులు ఉన్నారు.

9 మంది జూదరుల అరెస్ట్

కొల్లిపర: మండల పరిధిలోని తూములూరు శివారు క్రిస్టియన్ పాలెంలో శనివారం రాత్రి పేకాటాడుతున్న 9 మందిని అదుపులో తీసుకుని వారి వద్ద నుంచి 11620 రూపాయలు ఆటో ఆరు సెల్‌ఫోన్లు సీజ్ చేసి వారిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై పి.కోటేశ్వరరావు తెలిపారు.

వ్యక్తి అదృశ్యం

మంగళగిరి టౌన్: వ్యక్తి అదృశ్యంపై మంగళగిరి పట్టణ పోలీస్‌స్టేషన్‌లో శుక్రవారం రాత్రి కేసు నమోదైంది. మంగళగిరి బ్యాంక్‌కాలనీలో నివసిస్తున్న బొద్దాని ఉషకు ఇద్దరు సంతానం. ఉష కుమారుడైన బొద్దాని శ్రీను భార్యతో గొడవలు పడి కొంతకాలంగా తల్లి ఉష వద్దే ఉంటూ వంటపనులకు వస్తూ ఉండేవాడు. గత నెల 10వ తేదీ ఉదయం 6 గంటలకు సిమెంట్ పని నిమిత్తం మంగళగిరి పాతబస్టాండ్ వద్దకు వెళ్లాడు. తిరిగి సాయంత్రం ఇంటికి రాలేదు. రెండు రోజుల తర్వాత ఫోన్ చేసి వేరే వద్ద సిమెంట్ పనులు చేసుకుంటున్నాను అని చెప్పాడు. ఈ క్రమంలో సెప్టెంబర్ 21న గ్యాస్ అయిపోయిందని, డబ్బులు వెయ్యాలని చెప్పగా వెయ్యి రూపాయలు ఫోన్‌పే చేశాడు. ఆ తరువాత రోజు ఫోన్ చేస్తే తన కుమారుడి ఫోన్ స్విచ్ఛాఫ్ వస్తోందని తల్లి ఉష పేర్కొంది. బంధువులను, తెలిసిన వారిని విచారణ చేయగా తన కుమారుడికి ఆచూకీ లభ్యం కాకపోవడంతో పట్టణ పోలీస్ స్టేషన్‌లో శుక్రవారం రాత్రి ఫిర్యాదు చేసినట్లు పోలీసులు పేర్కొన్నారు. శ్రీను వయస్సు 31 సంవత్సరాలని, ఎత్తు 5 అడుగుల 4 అంగుళాలని, తెలుపురంగులో ఉంటాడని, జుట్టు లైట్ ఎరుపురంగులో ఉంటుందని ఫిర్యాదులో పేర్కొంది. ఉష ఫిర్యాదుపై పోలీసులు మిస్సింగ్ కేసు నమోదు చేశారు.

బావిలో జారిపడి వ్యక్తి మృతి

మంగళగిరి టౌన్: బావిలో జారిపడి ఓ వ్యక్తి మృతి చెందిన ఘటన మంగళగిరి మండలంలో శుక్రవారం చోటుచేసుకుంది. మంగళగిరి మండలం కురగల్లు గ్రామానికి చెందిన కట్టిపోగు సురేంద్ర (32) నీరుకొండలో వీఆర్ఏ అతనికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. రెండేళ్ల క్రితం సురేంద్ర తండ్రి అనారోగ్యంతో మృతి చెందడంతో ఆ ఉద్యోగాన్ని అతనికి కేటాయించారు. ఉద్యోగం రాకముందు కొంత పొలం కౌలుకు తీసుకుని అప్పుల పాలైనట్లు సురేంద్ర భార్య అరుణ తెలిపారు. ఆర్థిక ఇబ్బందులు, తల్లిదండ్రులు చనిపోవడంతో మానసిక క్షోభకు గురై బాధపడుతూ ఉండేవాడని ఆమె తెలిపింది. శుక్రవారం మధ్యాహ్నం సమయంలో ఇంట్లో నుంచి డ్యూటీకి వెళ్లాడని తెలిపారు. బంధువులు నీ భర్త సురేంద్ర సమీపంలోని మల్లె తోటలో ఉన్న బావిలో పడి చనిపోయినట్లు తెలిపాడని పేర్కొన్నారు. ఇదిలా ఉండగా అప్పుల బాధతో చనిపోయేంత పిరికివాడు కాదని, గతంలో ఒక ప్లాట్ అమ్మి కొన్ని అప్పులు తీర్చాడని, కేవలం మనశ్శాంతి కోసమే ఆ బావి దగ్గర కూర్చోవడానికి వెళ్తుంటాడని పేర్కొన్నారు. ప్రమాదవశాత్తు బావిలోపడి ఉండొచ్చని తన భర్తకు ఈత రాదని ఫిర్యాదులో పేర్కొంది. ఫిర్యాదు మేరకు మంగళగిరి రూరల్ పోలీసులు అండర్ సెక్షన్ 194 బీఎన్ఎస్ఎస్ కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఘనంగా గ్యార్మీ వేడుకలు

తాడేపల్లి రూరల్: మంగళగిరి తాడేపల్లి నగరపాలక సంస్థ పరిధిలోని కొలనుకొండలో శనివారం గ్యార్మీ పండుగ వేడుకలను అంగరంగ వైభవంగా నిర్వహించారు. వైఎస్సార్ సీపీ గ్రామ అధ్యక్షుడు నూతక్కి శ్రీనివాసరావు ప్రత్యేక పూజలు చేశారు.

కూటమి ప్రభుత్వానివి ప్రజావ్యతిరేక చర్యలు

- నందివెలుగులో గ్రామ కమిటీ, అనుబంధ కమిటీల ఎన్నిక
- కోటి సంతకాల సేకరణలో మాజీ ఎమ్మెల్యే శివకుమార్



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే శివకుమార్

తెనాలి: కూటమి ప్రభుత్వ ప్రజావ్యతిరేక చర్యలను వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు ప్రజల దృష్టికి తీసుకెళ్లాలని ఆ పార్టీ నియోజకవర్గ సమన్వయకర్త, మాజీ ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ సూచించారు. గ్రామ/వార్డు కమిటీలు, అనుబంధ కమటీల నియామకంలో భాగంగా శనివారం రాత్రి రూరల్ మండల గ్రామం నందివెలుగులో పార్టీ నేత బొంతు నరేంద్రరెడ్డి మేడపై ఏర్పాటైన సమావేశంలో శివకుమార్ మాట్లాడారు. కూటమి ప్రభుత్వం సూపర్ సిక్స్ హామీలను అమలుచేయకుండా ప్రజలను మభ్యపెడుతోందని చెప్పారు. బెల్టుషాపులపై వస్తున్న ఆదాయం సరిపోవటం లేదని కూటమి నేతలు నకిలీ మద్యం తయారు చేయిస్తూ రాష్ట్రవ్యాప్తంగా సరఫరా చేస్తున్న రాకెట్ ఇటీవలే బయటపడిందని గుర్తుచేశారు. వీటితో పాటు పేద విద్యార్థులకు వైద్యవిద్య, పేదరోగులకు ఉచిత వైద్యం అందుబాటులోకి తీసుకొచ్చేందుకు మాజీ సీఎం వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి 17 మెడికల్ కాలేజీలు, అనుబంధ హాస్పటల్స్ నిర్మాణానికి పూనుకున్న విషయం తెలిసిందేనన్నారు. వీటిలో కొన్ని కాలేజీలు పూర్తికాగా, మిగిలినవి తుదిదశలో ఉన్నాయని గుర్తుచేశారు. ప్రభుత్వమే నిర్వహించాల్సిన ఈ మెడికల్ కాలేజీలను కూటమి ప్రభుత్వం పీపీపీ పద్ధతిలో ప్రైవేటు వ్యక్తులకు కట్టబెడుతోందని విమర్శించారు. ఫలితంగా భవిష్యత్‌లో పేద విద్యార్థులకు వైద్యవిద్య అందని ద్రాక్షగా మారుతుందని శివకుమార్ అన్నారు. ప్రభుత్వ మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తూ వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో కోటి సంతకాల సేకరణ కార్యక్రమం చేపట్టినట్టు తెలిపారు. రూరల్ మండల పార్టీ అధ్యక్షుడు చెన్నుబోయిన శ్రీనివాసరావు అధ్యక్షత వహించిన సమావేశంలో పార్టీ గ్రామ కమిటీ అధ్యక్షుడిగా షేక్ రబ్బానిని ఎన్నుకున్నారు. అక్కడే సంతకాల సేకరణ ప్రారంభించారు. తెనాలి జడ్పీటీసీ పిల్లి ఉమాప్రణతి, ఎంపీపీ ధర్మరాజుల చెన్నకేశవులు, తోటకూర సుబ్రహ్మణ్యం, నందివెలుగు గ్రామ పరిశీలకుడు, తేలప్రోలు సర్పంచ్ షేక్ బాషా, ఎంపీటీసీ షేక్ సిలార్‌జాని, బెజ్జం బాజీ, వేముల మహేష్, బత్తుల గోపి, కుర్రా జస్వంత్ యాదవ్, కమాదు స్వామి, కనుగోలు సురేష్ పాల్గొన్నారు.

ముమ్మరంగా కోటి సంతకాల సేకరణ

వైఎస్సార్ సీపీ ప్రభుత్వం హయాంలో నిర్మించిన ప్రభుత్వ మెడికల్ కాలేజీలను పీపీపీ విధానం పేరుతో ప్రైవేటుకు కట్టబెట్టడాన్ని వ్యతిరేకిస్తూ కోటి సంతకాల సేకరణ కార్యక్రమం తెనాలిలో ముమ్మరంగా జరుగుతోంది. వైఎస్సార్ సీపీ గ్రామ/వార్డు కమిటీ, అనుబంధ కమిటీల నియామకం చేసుకుంటూ, ఆ కమిటీలచే సంతకాల సేకరణను చేపడుతున్నారు. ఇందులో భాగంగా శనివారం రాత్రి రూరల్ మండల గ్రామం నందివెలుగులో జరిగిన కార్యక్రమంలో పార్టీ సమన్వయకర్త, మాజీ ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ పాల్గొన్నారు. పట్టణంలోని మూడు వార్డుల్లో ఈ కార్యక్రమాలను పార్టీ నాయకులు నిర్వహించారు.



8వ వార్డులో సంతకాల సేకరణ ప్రారంభంలో గుంటూరు కోటేశ్వరరావు, తాడిబోయిన రమేష్

- తొలుత 8వ వార్డులో జరిగిన సమావేశంలో మున్సిపల్ మాజీ వైస్‌చైర్మన్, 15వ వార్డు కౌన్సిలర్ గుంటూరు కోటేశ్వరరావు సంతకాల సేకరణను ప్రారంభించారు. పార్టీ నేత తాడిబోయిన రమేష్ ఆధ్వర్యంలో ఏర్పాటైన కార్యక్రమంలో కౌన్సిలర్లు తోట రఘురాం, పేరం సంజీవరెడ్డి, చింకా సురేష్ చంద్ర యాదవ్, కుక్కల ముక్తేశ్వరరావు (వాసు) తదితరులు పర్యవేక్షించారు.
- పట్టణ 13వ వార్డులో వార్డు కౌన్సిలర్ కుర్రా సుజాత, కుర్రా శ్రీను పర్యవేక్షించిన సమావేశంలో పార్టీ నాయకుడు దేవరపల్లి కిశోర్ సంతకాల సేకరణను ప్రారంభించారు. పార్టీ నేతలు మల్లెబోయిన రాము, పఠాన్ అసద్, పిల్లి వీరయ్య, పిల్లి ప్రేమరాజ్, పెసర్లంక రమణ పర్యవేక్షించారు.
- స్థానిక 24వ వార్డులో కౌన్సిలర్ పెదలంక లక్ష్మీ లావణ్య ఆధ్వర్యంలో ఏర్పాటైన సమావేశంలో కో-ఆప్షన్ సభ్యురాలు గొరికపూడి నిర్మల సంతకాల సేకరణను ప్రారంభించారు. కౌన్సిలర్లు షేక్ దుబాయ్‌బాబు, యాతాటి అనిల్, పార్టీ నేతలు బండ్లమూడి నాగేశ్వరరావు, కానంపూడి రఘురామిరెడ్డి, రుద్రపాటి చెన్నయ్య, అమర్తలూరి శ్రీనివాసరావు, పార్టీ పరిశీలకుడు అక్కిదాసు కిరణ్‌కుమార్ పర్యవేక్షించారు.

నిర్మించి.. గాలికొదిలేశారు!

- తెనాలిలో రైతు 'బేజార్'
- రూ.15 లక్షలతో నిర్మాణం
- అయిదారు నెలల క్రితమే పూర్తి



బోసురోడ్డులోని రైతుబజారు

తెనాలి: పట్టణ బోసురోడ్డులో జిల్లా కేంద్ర సహకార బ్యాంకు దగ్గరి రైతుబజారును మరోచోటుకు మార్చేందుకు అధికారులు నిర్ణయించారు. అక్కడకు సమీపంలోని బోసురోడ్డు నుంచి పోస్టాఫీసు రోడ్డులో ఎల్ఐసీ కార్యాలయం వద్ద రూ.12 లక్షల వ్యయంతో కొత్తగా రైతుబజారును నిర్మించారు. ఇందుకోసం రోడ్డును కొంత వెడల్పు చేయాల్సివచ్చింది. మొత్తం రూ.15 లక్షల మున్సిపల్ సాధారణ నిధులతో నిర్మించిన ఈ రైతుబజారులో పది షాపులను నిర్మించారు. దీనిలో ఒకటి ఆఫీస్‌గా వినియోగిస్తారు. అయిదారు నెలల క్రితమే నిర్మాణం పూర్తిచేసుకుని రంగులతో ముస్తాబు చేసిన ఈ నిర్మాణాన్ని ఎందుకనో వదిలేశారు.

బోసురోడ్డులోని రైతుబజారును ఇక్కడకు మార్చకుండా ఊరుకున్నారు. కారణం తెలీదు. మద్యం దుకాణానికి చేరువలో ఉన్న ఖాళీగా ఉన్న రైతుబజారు నిర్మాణ షాపులను రాత్రివేళల్లో మందుబాబులు వాడేస్తున్నారు. ఖాళీ మద్యం సీసాలు, గ్లాసులు ఇందుకు నిదర్శనం. పందులు, పశువులు సంచరిస్తున్నాయి. ఫ్లోరింగ్‌కు వేసిన అద్దంలాంటి టైల్స్ మురికిపట్టాయి. కొన్ని షాపులు దుర్గంధంగా తయారయ్యాయి. కనీసం ప్రారంభోత్సవం కూడా చేయకుండానే నిర్లక్ష్యంగా వదిలేయటం విమర్శలకు గురవుతోంది. ప్రారంభం తర్వాత మార్కెట్ యార్డు నిర్వహణలో బోసురోడ్డు రైతుబజారును ఇక్కడకు తరలిస్తారని చెబుతున్నారు. ఇదే విషయమై అడిగిన ప్రశ్నకు, ఈ నెలాఖరులోనే నూతన రైతుబజారు ప్రారంభోత్సవం జరుగుతుందని మున్సిపల్ ఇంజినీరు పి.శ్రీకాంత్ సమాధానమిచ్చారు.



నూతనంగా నిర్మించిన రైతుబజారు



దుర్గంధంగా తయారైన షాపుల్లో ఒకటి

ఘనంగా ధన్వంతరి జయంతి మహోత్సవం



గ్రామీణ వైద్యులకు సత్కారం

తెనాలి: స్థానిక షరాఫ్‌బజార్లోని శ్రీసువర్చలసమేత శ్రీపంచముఖ ఆంజనేయస్వామి దేవస్థానంలో శనివారం శ్రీధన్వంతరి జయంతి మహోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. శ్రీవిఖనస శ్రీనివాస ట్రస్ట్, శ్రీపంచముఖ ఆంజనేయస్వామి సంకీర్తన బృందం సంయుక్త ఆధ్వర్యంలో ఆలయ ప్రాంగణంలోని మండపంలో శ్రీధన్వంతరి స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. మహిళలు విశేషంగా పాల్గొని స్వామివారి పూజా కార్యక్రమాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఆలయ కార్యనిర్వహణాధికారి హరి ప్రసాద్, ఆలయ వంశపారంపర్య అర్చకుడు రొంపిచర్ల శ్రీనివాసమూర్తి నేతృత్వంలో గ్రామీణ ప్రాంతంలో వైద్య రంగంలో విశేష సేవలందిస్తున్న డాక్టర్ అద్దేపల్లి శ్రీమన్నారాయణచార్యులు, డాక్టర్ నారాయణం వేణుగోపాల్, ఫిజియోథెరపీ విభాగంలో సేవలందిస్తున్న డాక్టర్ బండారు రవికాంత్‌ను నిర్వాహకులు సత్కరించి జ్ఞాపికలను అందజేశారు. ఈ సభలో వక్తలు ధన్వంతరి జయంతి విశిష్టతను వివరించారు. సంకీర్తనబృందం సభ్యులు శ్రీవెంకటేశ్వర గానామృతం, శ్రీహనుమాన్ చాలీసా పారాయణ చేశారు.

అనంతరం భక్తులకు ప్రసాద వితరణ చేశారు. అర్చకుడు ఆర్‌వీ కిరణ్‌కుమార్, సంకీర్తన అధ్యక్షురాలు మూర్తి అనురాధ, ట్రస్టు సభ్యులు జంద్యం రామారావు, మూర్తి వెంకటేశ్వరరావు, గుడివాడ బాలకృష్ణ, మడుపల్లి చంద్రశేఖర్, రొంపిచర్ల సురేష్, మాజేటి వెంకటేష్, వెచ్చా కిషోర్, సంకీర్తన సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

నసీమా చారిటబుల్ ట్రస్ట్ సేవలు అభినందనీయం

డీఎల్‌పీవో స్వరూపరాణి



నూతన వస్త్రాలు అందజేస్తున్న డీఎల్‌పీవో స్వరూపరాణి

తెనాలిటౌన్: నసీమా చారిటబుల్ ట్రస్ట్ సేవలు అభినందనీయమని డీఎల్‌పీవో స్వరూపరాణి పేర్కొన్నారు. రూరల్ మండలం కొలకలూరు గ్రామంలో పంచాయతీ కార్యాలయం వద్ద శనివారం పారిశుద్ధ్య కార్మికులకు నూతన వస్త్రాలు పంపిణీ నిర్వహించారు. నసీమా చారిటబుల్ ట్రస్ట్ నిర్వాహకులు కె.రమేష్‌బాబు సతీమణి నసీమా 8వ వర్ధంతి సందర్భంగా ఈ సేవా కార్యక్రమం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా డీఎల్‌పీవో స్వరూపరాణి, డిప్యూటీ ఎంపీడీవో వైవీడీ ప్రసాద్ పాల్గొని కార్మికులకు నూతన వస్త్రాలు అందజేశారు. ట్రస్ట్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న సేవా కార్యక్రమాలను అభినందించారు. కార్యక్రమంలో హరీష్‌నాయుడు, బి.చంద్రమోహన్, డి.శ్రీనివాసరావు, ఎన్.సాయి, ఎం.వీరరాఘవయ్య, ఎ.వెంకటసత్యనారాయణ, ఎ.శివనాగేశ్వరరావు, జి.వెంకటేశ్వరరావు, తోట నరేంద్ర ఉన్నారు.

సేవలు మెరుగుపరచడమే 'స్మార్ట్' లక్ష్యం

తాడికొండ: భవిష్యత్తు అవసరాలను దృష్టిలో ఉంచుకొని సేవలు మెరుగుపరచడమే స్మార్ట్ సిటీల లక్ష్యమని అడ్వాన్స్‌డ్ ఇన్నోవేషన్ అంబాసిడర్ ప్రొఫెసర్ డాక్టర్ మానికొండ శ్రీనివాస శేషసాయి అన్నారు. మోతడక చలపతి ఇంజినీరింగ్ కళాశాలలో ఆలిండియా కౌన్సిల్ ఫర్ టెక్నికల్ ఎడ్యుకేషన్- వాణి పథకంలో భాగంగా రెండు రోజుల పాటు నిర్వహించిన జాతీయ సదస్సు ముగింపు కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. స్మార్ట్ సిటీస్‌కు 7 మూల స్తంభాలైన స్మార్ట్ లవింగ్, స్మార్ట్ పీపుల్, స్మార్ట్ ఎకానమీ, స్మార్ట్ గవర్నెన్స్, స్మార్ట్ మెబిలిటీ, స్మార్ట్ ఎన్విరాన్‌మెంట్‌లపై వివరించారు. మరో అతిథి సీనియర్ సాఫ్ట్‌వేర్ ఇంజినీర్ కోయి లక్ష్మీ ప్రసాద్, ప్రిన్సిపాల్ డాక్టర్ కె.నాగ శ్రీనివాసరావు, డీన్‌లు డాక్టర్ సుబ్బారావు, డాక్టర్ బాలమురళీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

అండర్-14,17 వాలీబాల్ పోటీల్లో సత్తా



భట్టిప్రోలు: కర్లపాలెం మండలం యాజలి జెడ్పీ హైస్కూల్‌లో శుక్రవారం జరిగిన బాపట్ల జిల్లా స్థాయి అండర్-14,17 వాలీబాల్ పోటీలలో అండర్-14 విభాగంలో భట్టిప్రోలు టీఎంరావ్ హైస్కూల్ వాలీబాల్ బాలికల టీం రన్నర్స్‌గా నిలిచింది. ఈ టీమ్‌లో షేక్ జుబేదా, షేక్ కలీమా, కారంపూడి మమత, షేక్ యాసీనా, కనపరాజు సోనాక్షి, సయ్యద్ మునీరా ఉన్నారు. అండర్-14 ఉమ్మడి గుంటూరు జిల్లా టీమ్‌కు నక్కా మౌనిక, అండర్-17 జట్టుకు పఠాన్ రహమత ఎంపికయ్యారు. ఈ సందర్భంగా బాపట్ల జిల్లా విద్యాశాఖాధికారి పురుషోత్తం విజేతలకు మెడల్స్ అందజేసి, అభినందించారు. శనివారం పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో విద్యార్థులను, పీఈటీని అభినందించారు. ఎస్‌జీఎఫ్ జిల్లా సెక్రటరీ షేక్ కరిముల్లా, ప్రధానోపాధ్యాయులు చందలూరి రామకోటేశ్వరరావు, పీఈటీ ఎండీ అనూల్ హక్, ఎస్‌జీఎఫ్ కె.బుజ్జి, కరస్పాండెంట్ పి.మల్లికార్జునరావు, ఎస్ఎంసీ చైర్మన్ అత్తోట సుగుణ కుమారి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

క్రిస్టియన్, ముస్లిం, దళితులపై దాడులను అరికట్టాలి

మంగళగిరి టౌన్: క్రిస్టియన్, ముస్లిం, దళితులపై జరుగుతున్న దాడులను అరికట్టాలని క్రిస్టియన్, ముస్లిం, దళిత ఫ్రంట్ (సీఎంపీఎఫ్) వ్యవస్థాపక అధ్యక్షుడు మద్దిసెట్టి అజయ్‌బాబు అన్నారు. మంగళగిరి పట్టణ పరిధిలోని ప్రెస్‌క్లబ్‌లో శనివారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అజయ్‌బాబు మాట్లాడుతూ క్రిస్టియన్, ముస్లిం, దళితులపై జరుగుతున్న దాడులను అరికట్టి రాజ్యాధికారం వైపు సీఎండీఎఫ్ ముందుకు వెళ్లాలనే ఆలోచనా శక్తితో సంస్థను స్థాపించామన్నారు. ఉభయ రాష్ట్రాల్లో గ్రామస్థాయి నుంచి కమిటీలు వేసి సీఎండీఎఫ్‌ను బలోపేతం చేసి ప్రజల్లో చైతన్యం తీసుకురావాలన్నారు. అనంతరం ఏపీ అధ్యక్షులు సాధనాల రాజాజీ, అజయ్‌బాబులు.. నూతక్కి కృష్ణరేఖను ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మహిళా అధ్యక్షురాలిగా ఎన్నుకున్నారు. కార్యక్రమంలో తెలంగాణ అధ్యక్షులు ప్రసాద్, ముస్లిం మైనార్టీ నాయకులు యూసఫ్, మాజీ మేయర్ గ్రిటన్, క్రిస్టియన్ వెల్ఫేర్ ప్రొడక్షన్స్ ఫోరం అధ్యక్షులు పాస్టర్ పాతూరి సహదేవ్, ఎస్సీ ఎస్టీ రాష్ట్ర కార్యదర్శి కారుమంచి రామారావు, మాచర్ల ఏసోబు తదితరులు పాల్గొన్నారు.

'సాక్షి'పై దాడులకు తెనాలిలో నిరసన

- పత్రికా స్వేచ్ఛపై దాడి చేయటమేనంటూ వెల్లడి
- మండల తహసీల్దారుకు వినతి

తెనాలి: సాక్షి కార్యాలయాలపై దాడులు, అక్రమ కేసులను తెనాలిలో సాక్షి పాత్రికేయులు, ప్రజా సంఘాల నేతలు ఖండించారు. హైదరాబాద్‌లోని సాక్షి ప్రధాన కార్యాలయంలోకి ఏపీ పోలీసులు చొరబడి, ఎడిటర్ ఆర్.ధనంజయరెడ్డిని ఇబ్బంది పెట్టటం, అంతకుముందు విజయవాడ కార్యాలయంలోనూ తాళాలు తీయకముందే ప్రవేశించి, నోటీసులు తీసుకోవాలని ఒత్తిడి చేయటం, అక్రమ కేసులకు నిరసనగా శనివారం ప్రదర్శన చేశారు. కొత్తపేటలోని మండల తహసీల్దార్ కార్యాలయానికి చేరుకుని తహసీల్దార్ కేవీ గోపాలకృష్ణకు వినతిపత్రం అందజేశారు. సాక్షి ఎడిటర్, జర్నలిస్టులపై అక్రమ కేసులు రద్దుచేయాలని, సాక్షి కార్యాలయాలపై దాడి పత్రికా స్వేచ్ఛపై దాడి చేయటమేనని స్పష్టంచేశారు. కార్యక్రమంలో సాక్షి తెనాలి రీజినల్ సెంటర్ ఇన్‌చార్జి, ఇండియన్ జర్నలిస్ట్ యూనియన్ (ఐజేయూ) సభ్యుడు బీఎల్ నారాయణ, మానవ హక్కుల వేదిక రాష్ట్ర ఉపాధ్యక్షుడు, న్యాయవాది జీఎస్ నాగేశ్వరరావు, సీపీఐ సీనియర్ నాయకుడు బొల్లిముంత కృష్ణ, ఇండియన్ జర్నలిస్ట్ యూనియన్ (ఐజేయూ) సభ్యుడు ఓతుకోలు మార్కండేయులు, సాక్షి విలేకరులు ఆలపాటి సుధీర్, కేజే నవీన్, తాడిబోయిన రామకృష్ణ, కోటిరెడ్డి, తోట శ్రీనివాసరావు, సర్క్యులేషన్ ఇన్‌ఛార్జి దాసు, గోపి పాల్గొన్నారు.

దుర్మార్గాన్ని ప్రతిఒక్కరూ ఖండించాలి



సమాజంలో ఎంతోకొంత గళం విప్పగలిగిన సమూహం పత్రికా విలేకరులు. ఇలాంటి సమూహంపై ఇంత దుర్మార్గంగా వ్యవహరిస్తుంటే, గళమే లేని బడుగు జీవులపట్ల ప్రభుత్వం ఇంకెంత దుర్మార్గంగా ఉంటుందో ఊహించుకోవచ్చు. ఈ అణచివేత, దుర్మార్గాన్ని ఖండించాల్సిన బాధ్యత ప్రతిఒక్కరిపై ఉంది. ప్రధాన న్యాయమూర్తిపై బూటు విసిరినా పౌరసమాజం నుండి రావాల్సినంత స్పందన రాలేదు. ఇటువంటి సంఘటనలపై స్పందించి, ఉద్యమించేలా పౌరసమాజంలో చైతన్యం రావాల్సిన అవసరం ఉంది. లేకుంటే ఇలాంటి ఘోరాలు జరుగుతూనే ఉంటాయి. ప్రజాస్వామ్యానికి తీవ్ర విఘాతం కలుగుతుంది.

– జీఎస్ నాగేశ్వరరావు,
రాష్ట్ర ఉపాధ్యక్షుడు, మానవ హక్కుల వేదిక

అక్రమ కేసులు ఎత్తివేయాలి



పత్రికలపై దాడులు, అక్రమ కేసులు పత్రికా స్వేచ్ఛను హరించటమే అవుతుంది. ప్రభుత్వానికి వ్యతిరేకంగా వార్తలు రాస్తే, సదరు పత్రికపై ప్రెస్ కౌన్సిల్‌కు ఫిర్యాదు చేయొచ్చు. వివరణ కోరి, సంతృప్తి చెందకపోతే న్యాయస్థానాలను ఆశ్రయించే అవకాశముంది. అలాకాకుండా నేరుగా దాడులు, కేసులు సమంజసం కాదు. వెంటనే అక్రమ కేసులు ఎత్తివేయాలి.

– బొల్లిముంత కృష్ణ,
సీపీఐ సీనియర్ నాయకుడు

వాయు కాలుష్య నియంత్రణకు సహకరించాలి

మున్సిపల్ చైర్‌పర్సన్ తాడిబోయిన రాధిక



ర్యాలీని ప్రారంభిస్తున్న చైర్‌పర్సన్ రాధిక, కమిషనర్ అప్పలనాయుడు



మొక్కలు నాటుతున్న డీఎం రాజశేఖర్

తెనాలిఅర్బన్: వాయు కాలుష్య నియంత్రణకు అందరూ సహకరించాలని మున్సిపల్ చైర్‌పర్సన్ తాడిబోయిన రాధిక, కమిషనర్ జె.ఆర్.అప్పలనాయుడు పిలుపునిచ్చారు. స్వర్ణాంధ్ర స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా తెనాలి పురపాలక సంఘం ఆధ్వర్యంలో శనివారం పట్టణంలో ర్యాలీని వారు ప్రారంభించారు. మున్సిపల్ కార్యాలయం నుంచి ప్రారంభమైన ర్యాలీ గాంధీచౌక్ మీదుగా బోసురోడ్డు వరకు చేరుకుంది. స్వరాజ్ టాకీస్ సెంటర్‌లో మానవహారంగా ఏర్పడి నినాదాలు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ శుభ్రమైన గాలి (క్లీన్ ఎయిర్) అనే నినాదంతో వాయుకలుష్యాన్ని అందరూ నియంత్రించాలని సూచించారు. వాయు కాలుష్య వల్ల పర్యావరణం దెబ్బతింటుందన్నారు. పర్యావరణాన్ని పరిరక్షించాల్సి బాధ్యత అందరిపై ఉందని చెప్పారు. కార్యక్రమంలో మున్సిపల్ హెల్త్ ఆఫీసర్ మొవ్వా యేసుబాబు, ఆర్‌వో రాంప్రసాద్, డీఈ శ్రీనివాసరావు, టీపీవో సాంబశివరావు, మున్సిపల్ ఉద్యోగులు, మెప్మా సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు. స్వర్ణ ఆంధ్ర – స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంలో భాగంగా తెనాలి ఆర్టీసీ డిపో ప్రాంగణాన్ని శనివారం శుభ్రం చేశారు. ఆవరణలో మొక్కలు నాటారు. ఈ సందర్భంగా డిపో మేనేజర్ ఎ.రాజశేఖర్ మాట్లాడుతూ ప్రతి నెల 3వ శనివారం ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు చెప్పారు. పర్యావరణ పరిరక్షణకు మొక్కలు దోహదపడతాయని చెప్పారు. డిపో ఆవరణలో 25 మొక్కలు నాటినట్లు తెలిపారు. కార్యక్రమంలో అసిస్టెంట్ మేనేజర్ ప్రసాద్, పలువురు అధికారులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

ఎవరికి వారే.. యమునాతీరే!

- తెనాలిలో యథేచ్ఛగా అక్రమ కట్టడాలు
- చేతివాటం ప్రదర్శిస్తున్న ఓ అధికారి
- కౌన్సిలర్ ఫిర్యాదుతో వెలుగులోకి వచ్చిన అవినీతి
- విచారణ జరుపుతున్న మున్సిపల్ అధికారులు

తెనాలిఅర్బన్: తెనాలి పట్టణంలో యథేచ్ఛగా అక్రమ కట్టడాలు కొనసాగుతున్నాయి. వీటిని అనుమతించవద్దని మంత్రి మనోహర్ పదేపదే చెబుతున్నా అధికారుల్లో మాత్రం మార్పు రావటం లేదు. టౌన్ ప్లానింగ్ విభాగంలో పనిచేసే ఓ అధికారి ఓ భవన యజమాని దగ్గర రూ.90 వేలు లంచం తీసుకున్నట్లు వైఎస్సార్ సీపీ కౌన్సిలర్ ఫిర్యాదు చేయటంతో మున్సిపల్ కార్యాలయంలో కలకలం రేగింది. వివరాలలోకి వెళ్తే... బాలాజీరావు పేటలో 100 చదరపు గజాలలో ఎటువంటి మున్సిపల్ అనుమతులు లేకుండా ఓ భవనాన్ని నిర్మిస్తున్నాడు. విషయం తెలుసుకున్న టౌన్ ప్లానింగ్ అధికారి అక్కడి వెళ్లి నిర్మాణ పనులు ఆపకుండా చేతివాటం ప్రదర్శించినట్లు ఆ ప్రాంత వైఎస్సార్‌సీపీ కౌన్సిలర్ దృష్టికి వచ్చింది. వెంటనే ఆయన విషయాన్ని మున్సిపల్ చైర్‌పర్సన్, కమిషనర్, ఎసీపీల దృష్టికి తెచ్చాడు. అనుమతులు లేకుండా భవనాలు నిర్మిస్తుంటే ఎందుకు అడ్డుకోవటం లేదని అధికారులను ప్రశ్నించాడు. త్వరలో జరిగే కౌన్సిల్ సమావేశంలో వీటిపై చర్చించనున్నట్లు ప్రకటించాడు. దీంతో అప్రమత్తమైన అధికారులు దీనిపై విచారణ జరుపుతున్నట్లు తెలిసింది. తెనాలిలో ఎటువంటి అనధికార కట్టడాలను అనుమతించవద్దని రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ మున్సిపల్ అధికారులతో జరిగిన సమీక్షలో హెచ్చరించాడు. అది జరిగిన మరుసటి రోజే ఆరోపణ రావటంతో మున్సిపల్ కార్యాలయంలో చర్చనీయాంశంగా మారింది.

సాహితీ లోకంలో ధ్రువతార విశ్వనాథ సత్యనారాయణ



నివాళి అర్పించిన పూర్వవిద్యార్థి బృందం

తెనాలి: కవిసామ్రాట్ విశ్వనాథ సత్యనారాయణ సాహితీలోకంలో ధృవతారగా ప్రముఖ ఆధ్యాత్మిక ప్రచారకర్త సంస్కృత, ఆంధ్ర భాషాధ్యాపకులు శ్రీమాన్ కూర్మనాథ్ ఆచార్యులు అన్నారు. స్థానిక చినరావూరులో కేఎల్ఎన్ సంస్కృత కాలేజీ పూర్వ విద్యార్థి బృందం ఆధ్వర్యంలో శనివారం సాయంత్రం విశ్వనాథ సత్యనారాయణ వర్ధంతిని నిర్వహించారు. వినాయకరావు అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథి కూర్మనాధ్ మాట్లాడుతూ రామాయణ కల్పవృక్షం, వేయిపడగలు, కిన్నెరసాని పాటలు, శతకాలు, గేయాలు...సహా వేలాదిగా రచనలు చేసి ఇతిహాసాలు సామాజిక సాంఘిక పరమైన విషయాలను సమాజానికి అందించిన మహా వ్యక్తి విశ్వనాథ అన్నారు. పలుచని వాడుకతో కలిగిన చందస్సును తెలుగు తల్లికి ముక్కెరగా చేసినటు కవి విశ్వనాథ అన్నారు. కవిసామ్రాట్‌గా కీర్తిని గడించిన సత్యనారాయణ రచనలు తెలుగు భాష బ్రతికి ఉన్నంతవరకు చిరస్థాయిగా ఉంటాయన్నారు. తెలుగు భాషా పండితుడు దేవయజనం మురళీకృష్ణ, రామలింగేశ్వర రావు, ఈఎల్‌వీ అప్పారావు, కృష్ణకుమారి, సద్యోజాతం లక్ష్మణరావు, ఫల్గుణ కుమార్, సత్యనారాయణ, అరుణకుమారి, మేడూరి శ్రీనివాసమూర్తి, సూర్యప్రభ, సుశీల, వర్ధని, సామ్రాజ్యలక్ష్మి తదితరులు విశ్వనాథ సాహిత్యంపై ప్రసంగించారు తొలుత ఆయన చిత్రపటానికి పుష్పాంజలి ఘటించారు.